

# మానవత్వపు నీడలో

మొరవపల్లి రెడ్డి



**చేయి** చురుక్కుమనడంతో కాలుతున్న సిగరెట్‌ను గిరాటేసి వాచీ కేసి చూచుకున్నాను. పావు తక్కువ ఎనిమిది.

దట్టంగా వ్యాపించిన పొగమంచు ఇంకా విడలేదు. రివ్వు రివ్వున వీచే చలిగాలికి నరాలు జివ్వుమంటున్నాయి.

నవీన్, కైలాష్‌లు ఇంకా రాలేదు.

మూడు రోజులు 'జునాఘడ్' ఆయిల్ సీడ్స్ రిసెర్చి స్టేషనులో నా టూర్ ప్రోగ్రామ్ ముగించుకుని ఆ మధ్యాహ్నమే హైదరాబాద్ ప్రయాణం.

అహమ్మదాబాదులో శ్రీమతీజీకి సాడియాలిస్ట్ ఉండనే ఉంది.

లోకల్‌గా ఏదో హాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం ఉందని జునాఘడ్‌లో కాలూనగానే అసిస్టెంట్ నవీన్ చెప్పడంతో ఈ వేళ్టిదాకా వాయిదా వేసుకున్నాను ఆ ప్రోగ్రామ్.

చలి అంత కంతకూ అధిక మవుతూంటే మరో సిగరెట్ వెలిగించుకుని గుండె నిండా పొగ పీల్చి, కోటు కాలర్ గొంతు చుట్టూ మరింత త్వరగా లాగాను.

చుట్టూ కొండలు... పచ్చటి చెట్లు... వాటి మధ్య కొలువై ఉన్న జునాఘడ్ సౌందర్యం వర్ణనాతీతం.

ఒకప్పటి జాగీర్దార్ల దివాణం లోనే నా బస.

అయినా తిరిగి హైదరాబాద్ వెళుతున్నా! అనుకోగానే అదో రిలీఫ్.

జీప్ హారన్ బొయ్యి మనడంతో ఆలోచనల నుండి తేరుకుని తలెత్తి చూచాను.

"సారీ, సర్! జీప్‌కు మైనర్ రిపేర్స్ వస్తేను..." నసిగాడు నవీన్.

చిరునవ్వుతో భుజం తట్టి—"డోంట్ వర్రీ. అన్నట్టు జీప్ మన కోసం వెయిట్ చేయడెందుకని వి గో బై వాక్. నాలుగు వీథులు చూచినట్టూ ఉంటుంది, తీరుబాటుగా నచ్చిన వస్తువు వెదుక్కొన్నట్టూ ఉంటుంది" అన్నాను.

"నో, సర్. ఇది మామూలు ఎంపోరియం కాదు. ఒక సేవాసదన్ వాళ్ళు నిర్వహిస్తున్నారు. చాలా దూరం." నసిగాడు.

జీప్‌లో ఎక్కి కూర్చున్నాను. జీప్ ముందుకు కదిలింది.

మేలిముసుగు తొలగించుకుని తొంగి చూస్తున్న లేజవరాలి దొంగ చూపుల్లా ఉన్నాయి అనిపించింది, మంచు ముసుగు లోంచి తొంగి చూచే షాపులు, ఇళ్ళు చూస్తుంటే.

వూరికి దూరాన ఒక గేటు ముందు ఆగింది జీప్. కిందకు దిగి తలెత్తి చూచాను. "మంజరీ సేవాసదన్" అన్న బోర్డు అగుపించింది.

దర్వాన్ చేతిలో విజిటింగ్ కార్డు ఉంచి, విశాల మైన తోటలో పని చేసుకుంటున్న అమ్మాయి లను పరికిస్తూండి పోయాను.

రాత్రి కురిసిన మంచు ఇంకా కరిగిపోలేదు. అరవిరిసిన గులాబి రేకులపై మేలిముత్యాల్లా మెరిసి పోతున్నాయి తుషార బిందువులు.

ఈలోగా దర్వాన్ వెంట వచ్చిన అమ్మాయి మమ్మలను ఆఫీసు గదిలోనికి తీసుకెళ్ళింది.

కళ్ళజోడు ధరించిన ఒక యాభై ఏళ్ళ స్త్రీని 'సరళా బెన్' అంటూ పరిచయం చేసింది.

"ఆయియే! ఆయియే, డాక్టర్ సాబ్" అంటూ ఆహ్వానించి కుర్చీలు చూపించింది సరళా బెన్. పరస్పర పరిచయాలయాయి.

షోకేసెస్‌లో ఉన్న బొమ్మల వంక చూస్తూ, "డాక్టర్ నవీన్, నేను పర్చేజ్ ముగించుకునే లోపులో మీకేదైనా పని ఉంటే చూసుకుని రండి" అంటూ నవీన్‌ను పంపించి వేశాను.

"ఓకే, సర్" అంటూ నవీన్ రిసెప్షన్ స్టేషన్‌కు వెళ్ళిపోయాడు.

కుర్చీలో కూర్చుంటూ నే వచ్చిన పని చెప్పాను. సరళా బెన్ ముఖం మరింతగా వికసించింది.

"లోపలికి రండి" అంటూ లేచి మరో గదిలోకి దారి తీసింది.

మా సంభాషణ అంతా హిందీలోనే సాగుతూంది.

బయట షోకేసుల్లో ఉన్న వస్తువుల కన్నా వంద రెట్లు మిన్నగా ఉన్నాయి అక్కడ. 'గుడ్‌గాడ్!' పైకే అనేశాను.

"ఇవన్నీ మా అమ్మాయిలు స్వయంగా తయారు చేసినవి" అంది. మృదువుగానే అయినా సగర్వంగా ఉందా పలుకు.

ఒక అందమైన చిన్నది వస్తువుల ఎంపికలో నాకు సాయం చేస్తూంటే, సరళా బెన్ ఒక మెత్తటి కుషన్ చెయిర్‌లో కూర్చుంది.

ఎంపిక తొందరగానే తెమిలింది. మూల్యం చెల్లించి రసీదు తీసుకున్నాను. వాటిని పేక్ చేసేందుకు లోపలికి వెళ్ళిందా చిన్నది.

సెగలు గక్కే వేడి చాయ్ రెండు కప్పులు మధ్య నున్న తగ్గు బల్లమీద సర్ది వెళ్ళిపోయిందో అమ్మాయి.

ఓ కప్పు నా ముందుకు జరిపి, తనో కప్పు అందుకుంది సరళా బెన్. చాయ్ గుటక వేస్తూ ఆమె వంక చూశాను. ముడుతలు పడిన శరీరమే అయినా వయసులో అందగత్తె అని చెబుతూంది. ఆ కళ్ళలో, చూపుల్లో ఏదో పట్టుదల. ఆ ముఖంలో ప్రసన్నత. వెండితీగల్లాంటి జుట్టు మీదుగా దుప్పట్టా సవరించు కుంటూ "మీ అభిరుచికి తగ్గ వస్తువులు దొరికాయా" అంది.

ఫ్రేములో బిగించి గోడకు వేలాడుతున్ననిలువెత్తు రేఖాచిత్రంపై చూపులు నిలిపి తలూపాను సమా ధానంగా.

పెయింటింగ్ డ్రాయింగ్‌కు సంబంధించిన వస్తువు లేమీ చూసిన గుర్తు లేదు. అందుకే ఆ ఫ్రేమ్ వంకే చూస్తూండి పోయాను.

చేతిలో పచ్చీ రాక గీసిన సోల్జరు బొమ్మ. కేవలం రేఖాచిత్రం. అందులో సౌందర్యఛాయగానీ, కళ గానీ లేదు. కానీ ఎదుట నిలుచుని సుదూర తీరాలను చూస్తూ ఒక సోల్జరు నుంచున్నట్టు అనుభూతి. పైగా ఆ సాధారణ చిత్రానికి అంతటి ఖరీదైన గోల్డ్ ఫ్రేమ్ కట్టించి అక్కడ ఎందుకు అంత భద్రంగా పదిల పరిచారో అర్థం అవలేదు.

ఖాళీకప్పు బల్లమీదుంచేసి

"బెన్‌జీ... ఈ ఫోటోకూడా మీ సేవాసదన్ వాళ్ళు వేసిందేనా" అన్నాను.

కాదన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

కొంప తీసి ఆమె భర్తగారిది కాబోలు. నా కెందుకు లెమ్మని ఊరుకోబోయినా కోతిలాంటి మనసు ఊరుకోనీయలేదు. "ఎవ రిదీ చిత్రం?" అన్నాను.

సరళా బెన్ ఘడియ సేపు కళ్ళు మూసుకుని మౌనంగా ఉండిపోయింది.

నన్ను నేనే మందలించుకుని, "సారీ, బెన్‌జీ. అన్నాను.

కళ్ళు తెరిచి సూటిగా నా ముఖంలోకి చూసింది.

ఆ చూపుల్లో భావాన్ని గుర్తించలేక చూపులు మరల్చుకున్నాను.

"డాక్టర్ సాబ్! అలాటి దేమీ లేదు. కానీ ఇన్ని సంవత్సరాల తరవాత ఆ మహనీయుణ్ణి గురించి నాలుగు ముక్కలు చెప్పుకునే సదవకాశం కలిగించిన మీకు నేనే సదా కృతజ్ఞురాలిని' అంది.

ఆవిడ మాటలు నాకు కాస్త రిలీఫ్ ఇవ్వడంతో సర్దుకు కూర్చున్నాను.

• • • •

"అవి స్వాతంత్ర్యపు తొలి రోజులు.

పరతంత్రం నుండి విముక్తి పొందిన ప్రజల్లో ఉత్సాహం, ఆనందం వెల్లువలై పొంగుతూంది. స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకుంటూ, భావి కార్య క్రమాలపై ప్రణాళికలు, రాజ్యాంగాలు అంటూ ఆలోచనా యంత్రాంగంలో ఉన్నారు అధినేతలు.

మరి కొందరుంది—

దేశ విభజనలో తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయా మన్న భావనతో అటు వారు ఇటూ, ఇటువారు అటూ అందినంత వరకూ చేత పుచ్చుకుని బార్డర్ను దాటేసి పాలోమని పరుగు లెట్టుతున్నారు.

ఆమె పేరు నళిని. అవి ఆమె వివాహపు తొలి రోజులు. నళిని ఎదిహేనేళ్ళ నిండిన తేజస్విని. భర్త మఖన్‌లాల్. మఖన్ కుటుంబీకు లంతా వ్యవసాయ దారులు.

మఖన్ వాళ్ళ భూములు పాకిస్తాన్‌లో ఉండి పోయాయి. బాల్యంలో ఆడి, పాడి గంతు లేస్తూ తిరిగిన ఆ కొండలు కళ్ళెదుటే కనిపిస్తున్నా అవన్నీ ఇప్పుడు భారతదేశానికి చెందినవి. ఆ భూభాగం మీద కాలు పెట్టడానికి తనకు అర్హత లేదు అనుకునేసరికి నళినికి దుఃఖం పొంగుకు వచ్చింది.

పాలోమని కాందిశీకులంతా చాటుగా బార్డర్ల దాటేసి ఇవతలి వారు అవతలికి అవతలి వారు ఇవతలికి పారిపోతున్నారు. రైళ్ళ క్రిక్కిరిసి ఉండేవి.


మఖన్‌లాల్‌కూడా తన బంధు బలగంతో అందిన వరకూ చేతపుచ్చుకుని భారతదేశం రావాలని రైలెక్కే శాడు. వెంట నళిని.

కని పెంచిన తల్లిదండ్రులను, తోడబుట్టిన వాళ్ళని, పెరిగిన పరిసరాలను వదిలి రావాలంటే నళిని గుండె లవిసి పోతున్నది. పదిహేనేళ్ళ పెంచిన తల్లిదండ్రుల కన్నా పది నెలల వివాహబంధం గొప్పదిగా తోచి, దుఃఖాన్ని దిగమింగి భర్తతో ప్రయాణమైంది నళిని.

రైల్లో ఎక్కేశాక అప్పటిదాకా 'నేను' నా వాళ్ళు, అన్న భావం నశించిపోయింది. కిక్కిరిసి ఉన్న ఆ రైల్లో అంతా తన లాటివారే ఉన్నారు. రైలు నెమ్మదిగా బార్డరు వేపు సాగిపోయింది.

• • • •

ఉన్నట్టుండి రైలు ఆగిపోయింది. అంతా ఆత్రుతగా తలలు బయట ఉంచారు. రైలును బలవంతంగా



పాకిస్తాన్ భూభాగంలోనే ఆపేశారని తెలిసి తిరిగి అందరూ మూటా ముల్లె చేత బట్టుకుని జట్లు జట్లుగా దొంగల్లా వెనక, ముందు చూసుకుంటూ బార్డర్ వేపు సాగిపోయారు.

పాకిస్తాన్ బార్డరుకూ, భారత్ భూభాగానికీ మధ్య కొంత మేర ఎవరికీ చెందని భూభాగం (నో మాన్స్ ల్యాండ్) ఉంది.

ఎలాగో బార్డర్ దాటేసి పరుగు లెట్టితే భారత భూభాగంలో పడిపోవచ్చు. ఆ పైన ఎవరూ ఏమీ చేయలేరు.

నళిని వాళ్ళ జట్టు చాలాసేపు ఒక చెట్టుకింద కూర్చుని వెంట తెచ్చుకున్న రొట్టెలు తిన్నారు. కొద్దిపాటి నీటితో గొంతు తడుపుకున్నారు.

దృఢకాయుడు సమున్నతుడు, పచ్చగా ఉన్నా ఎండకు కాగి అదోలాటి కమిలిపోయిన రంగుకు తిరిగిన మఖన్‌ను చూస్తూంటే ఇతని అండనఉంటే తను ఎంతటి కష్టాన్నయినా అవలీలగా భరించగలదు. ఆ దృఢమైన బాహువుల్లో సేద దీరి విశ్రాంతిగా పొద్దు పుచ్చగలనని అనుకుంది నళిని. కొసలు మెలి పెట్టిన ఆ నల్లటి మీసాలు, కొద్దిగా మాసిన గడ్డం, అశ్రద్ధగా వేసుకున్న నలిగిన బట్టల్లో అతడు తన పాలిటి దేవుడుగా తోచాడు. అమాంతం వెళ్ళి ఆ ఎదలో ముఖం దాచుకోవాలని తన గుండె సవ్వడి చేసింది. ఊహాలోకంలో అలాటి భావనతోనే తృప్తి పడింది నళిని. మేలిముసుగు మరింత తల మీదకు లాక్కుంది.

ఫిరోజు పూర్ దగ్గర చెక్‌పోస్ట్ కాకుండా కాస్త ఎగువకు వెళ్ళి దాటాలని అనుకున్నారు మఖన్ వాళ్ళు పిల్లల్లా అడుగు లేస్తూ నెమ్మదిగా బయలు దేరారంతా. గుండెలు గుబ గుబ లాడుతున్నాయి. దూరాన ఒకటీ అరా జట్లు ఎవరికీ చెందనిభూభాగాన్ని దాటేస్తున్నాయి.

అంతే! పెద్ద అరుపులూ విదలింపులూ!

బిక్కచచ్చి నిలిచి పోయారు!

పాకిస్తానీ బార్డరు సైనికులు నళిని వాళ్ళ జట్టును ఆపేశారు. ప్రాధేయపడగా పడగా అందరినీ వదిలేశారు, ఒక్క నళినిని మినహాయించి.

బతిమిలాడినా బామాలినా ఆ కర్కశ హృదయుల మనసు కరగలేదు. గత్యంతరం లేని మఖన్ జట్టు నళిని నొదిలేసి ముందుకు పోయింది.

నళిని కది జీవన్మరణ సమస్య. జన్మ జన్మల బంధం అని వెంట పడి వచ్చిన భర్త నిస్సహాయంగా వెనుదిరిగి చూస్తూ వెళ్ళిపోతున్నాడు.

అశ్రుధారలతో మసకేసి పోయి, చూపుల కంద కుండా అంతకంతకూ వారి ఆకారాలు చిన్నవిగా అయిపోతున్నాయి.

అక్కడున్న సైనికుల చూపులు వెకిలిగా ఉన్నాయి! పలుకులు వ్యంగ్యంగా ఉన్నాయి. కానీ, ఒకే ఒక సైనికుడు ఉలకక పలకక రాయిలా నిర్వికారంగా నుంచొని ఉన్నాడు. అతడు నళిని వైపే చూస్తు న్నాడు. ఆ చూపుల్లో ఎలాటి భావమూ వ్యక్తం కావడం లేదు. మేలిముసుగు మరింత ముందుకు లాక్కుంది నళిని.

గంటలు తరిగిపోతున్నాయి.

చీకట్లు వరిస్తున్నాయి.

దూరాన పర్వతాలు ఆకారాలు మాసిపోయి నల్లని రూపు సంతరించుకుంటున్నాయి.

సైనికుల హృదయాల్లో కోరికలు ముసురు కుంటున్నాయని వాళ్ళ మాటల ద్వారా, సౌంజ్ఞల ద్వారా సుస్పష్టమవుతూంది.

పదిహేనేళ్ళయినా నిండని తన జీవితం, ఈ నరరూప రాక్షసుల చేతులలో బలై పోక తప్పదని తన తలరాత తలుచుకుంటూంటే కన్నీళ్ళుకూడా కరువై పోయాయి. బండబారిన హృదయంతో అలాగే శిలలా నుంచుండి పోయింది నళిని.

చాయ్ కాచుకుని తాగి ఇద్దరు సైనికులు నళిని దగ్గరకు వచ్చారు.

నళిని ఊపిరి తీయడం మరిచిపోయింది.

ఇందాక నుంచున్న ఆ సోల్జరు అలాగే నుంచుని ఉన్నాడు. నళిని దగ్గరగా వస్తున్న సైనికుల కన్నా అలా కదలక మెదలక చూపులను కుంచిస్తూ చూస్తున్న నిలువెత్తు సైనికుణ్ణి చూస్తూంటే నళిని గుండెలో దడ పుట్టుకొస్తూంది.

"హట్ జావ్!" భూమి దద్దరిల్లే లాటి పెద్ద కేక.

నళినిని సమీపిస్తున్న సైనికులు స్తంభించి పోయారు.

"ఏ ఒక్కరు ముందు కదుగేసినా మర్యాద దక్కదు" అంటూ ఇందాకటి నుండీ ప్రతిమలా నుంచున్న సైనికుడు మెరుపులా నళిని దగ్గరకు దూకి ఎడమ చేయి మణికట్టు పట్టుకుని సత్తువ కొద్దీ ఎవరికీ చెందని భూభాగంలోకి లాక్కుపోయాడు.

భయంతో బిర్ర బిగుసుకు పోయిన నళిని కాళ్ళు అతని వెంట యాంత్రికంగా పరుగు లెట్టు తున్నాయి. అయిపోయింది. సర్వ నాశనమై పోయింది అనుకుంటూ.

వెనకనుండి సైనికులు "అరే చందూ! ఆ పిల్లను ఎక్కడికి నీ ఒక్కడివే లాక్కెళ్ళు తున్నావు. ఫస్ట్ చాన్స్. నీ కేనా? అరె భాయీ! త్వరగా కానియ్" వాగుతున్నారు వెకిలిగా నవ్వుతూ.

పరుగెడుతున్న వాడల్లా ఆగి గిరుక్కున వెనుదిరిగి "నోరు మూయండిరా, వెధవల్లారా ... ఆడ పిల్లను భర్త నుండి వేరు చేసిన ఘనకార్యం చాలక పశుత్వానికి పాల్పడతారా ... ఈ అమ్మాయిని బార్డర్ దాటించి వస్తాను. వాళ్ళ వాళ్ళతో కలిపి వేస్తాను! ఖబడ్‌దార్! అని హెచ్చరించి నాలు గడుగులు భారత భూభాగంపై ఉరికాడు.

"అరె! పాగల్ ... చందూ ... అగు" అరుస్తున్నారు వెనుకనుండి.

అయినా చందూ కాళ్ళు ముందుకే ఉరికాయి.

"రుక్ జావ్" అంటూ భయంకరమైన కేక వినవడింది. చందూ కాళ్ళు అప్రయత్నంగా ఆగి పోయాయి.

"అడుగు ముందుకు వేశావో ... కుక్కను కాల్చి నట్టు కాల్చి పంపేస్తా." గర్జించిందో కంఠం.

తన 'బందూక్' సవరించుకుని "అరే ... పోరా .. గాడిదా ... అని అమ్మాయ్ పరుగెట్టు దాటిపో. మీ వాళ్ళను కలుసుకో"అనీ హెచ్చరించాడు చందూ.

అతడికి రెండు చేతులూ జోడించాలని ఉన్నా వ్యవధి లేదు. "భూఘురా" కాళ్ళకు బంధాలు పడుతుంటే పారిపోయింది నళిని.

తుపాకీ పేలిన శబ్దం...

"అమ్మా!" అన్న ఆర్తనాదం...

వెనుతిరిగి చూచింది నళిని...

గుండెలో నుండి ఎర్రటి రక్తం స్రవిస్తూంటే అదిమిపట్టి "భాగో ... భాగో" అనిహెచ్చరి స్తున్నాడు చందూ.

భారత భూభాగంలో అడుగు పెట్టి ఆయా సంతో వగర్చుతూ వెనుదిరిగి చూసింది నళిని. నల్లని చీకట్లో చట్టగా పడిపోయాడు చందూ.

● ● ● ●

పిచ్చిగా రెండు రోజులు కాందిశీకుల జట్లన్నీ గాలించింది నళిని. ఆకలి ... నిరాశ ... ఒంటరితనం నిస్పృహ ...

వెదగ్గా వెదగ్గా మఖన్ వాళ్ళ జట్టు వాళ్ళంతా అవుపించారు. నళిని సంతోషానికి అవధుల్లేవు. మేలి ముసుగు సవరించుకొని భర్త చెంత నిలుచుంది.

"అరె! ... నళినీ ... నీవా ... ఇక్కడ" మఖన్ పలుకులలో కలయికలోని సంతోషం లేదు. ఎందు కొచ్చావు? అన్నట్టు ధ్వనించింది.

తన్ను చూడగానే రెండు చేతులా ఆహ్వానించి పొదివి పట్టి, వీపు నిమిరి తన బాధ, వేదన తీర్చుతా డనుకొన్న దానికి భిన్నంగా అసహ్యం నిండిన చూపు లతో ఎగాదిగా చూస్తూంటే భరించలేకపోయింది నళిని.

అతడి భుజం మీద పడి తా ననుభవించిన మనఃక్షోభం చెప్పుకొని సేదదీరాలని నళిని హృదయం ఆరాటపడుతోంది. కాని భర్త ప్రవర్తన చూచేసరికి పుట్టెడు నిరాశ ఎదురైంది. అక్కడికీ మనసు పట్టలేక ఎలా పారిపోయి వచ్చిందో చెప్పింది. మఖన్ మౌనంగా ఉండిపోయాడు. జట్టులోనివారు కూడా మిన్నకుండిపోయారు.

నళినిపడిన కష్టాల కన్నా, మనః సంక్షోభం కన్నా వాళ్ళ మౌనమే ఎక్కువగా బాధించింది.

ఆ రాత్రి అందరూ పడుకున్నాక నెమ్మదిగా భర్త దగ్గరగా జరిగి కూర్చుంది నళిని.

మఖన్ మాట్లాడలేదు.

"చూడండీ ... " పిల్చింది.

". . . ."

చేతిని పట్టుకొని కదిపింది.

చరాలున ప్రక్కకు ఒత్తిగిలి "నళినీ! దూరంగా జరుగు ... అసలు ... నీకూ నాకూ ఏ సంబంధమూ లేదు. నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళిపో" అన్నాడు మఖన్.

"ఎందుకనీ ... ఎక్కడికైనా వెళ్ళే అవసరం నాకేముంది? మీరు నా భర్త" అంది ఆగ్రహస్వరంతో నళిని.

"అది అంతా మునుపు రోజుల ప్రేమ. ఇప్పుడు కాదు. జరిగిందేదో జరిగిపోయింది. ఇక ఆ విషయాలన్నీ మరిచిపో" అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

అప్పటికి కానీ నళినికి నెమ్మది నెమ్మదిగా బోధ పడలేదు. తనను భర్త అనుమానిస్తున్నాడు—తను శీలం కోల్పోయిన దానిగా, పతితగా చూస్తున్నాడు అని.

కాపురానికి వచ్చిన ఆరు నెలలో పెద్దవాళ్ళకు తెలియకుండా చాటుమాటుగా పగటిపూట కూడా సరసాలాడ్డానికి పని ఎగ్గొట్టి వచ్చిన మదన్ "నళినీ నీవు నా ప్రాణం ... కావాలంటే ఇక్కడ చూడు.. గుండెలో ... నళిని ... నళిని ... అని అంటున్నదో లేదో ... అని పలువిధాల లాలించి పాలించిన భర్త పరాయివాడుగా ప్రవర్తిస్తున్నాడంటే ... నళినీ ఇందుకు తప్పు ఎట్టా అనిపించలేదు. అది స్త్రీ జన్మలోనే ఉందిలా గుంది. బహుశా శీలం అనేది ఒక్క స్త్రీకే భగవంతుడు వరప్రసాదంగా ఇచ్చి దానినే ఆమె పాలిట శాపంగా దీవించి పంపాడల్లే ఉంది.

"నా మాట నమ్మరా ... మీరు అపోహ పడుతున్నారు. నమ్మండి" అంటూ మాట తేలు వేసి భోరున ఏడ్చింది నళిని.

"నళినీ ... వెళ్ళిపో ... అవన్నీ నా పిచ్చిపనులు. నీకూ నాకూ ఎలాంటి సంబంధం లేదు. కావాలంటే ఈ డబ్బు తీసుకో." నడుముకు కట్టిన గుడ్డసంచి లాగుతోంటే అర్థమైంది.

నళిని మనసంతా ఉదాసీనంగా మారిపోయింది. భార్యను నమ్మని భర్తతో కాపురం చేసేదానికన్నా తాను నమ్మిన ధర్మానికి కట్టుబడి కష్టమైనా నష్టమైనా బ్రతకడం సులభమనిపించింది.

"ఉంచుకోండి... ఆ డబ్బు మీ అక్కరకు పనికి వస్తుంది" అని అక్కడినుండి వచ్చేసింది.

చాలా రోజులు ఏమీ తినాలని ఉండేది కాదు. శూన్య దృక్కులతో పరిపరాని అవమానభారంతో కుంగిపోయింది నళిని. కాందిశీకుల శిబిరాల్లో ఉంటూ దయా ధర్మంగా దొరికే ఆహారంతో కడుపు నింపుకొనేది. ఎప్పుడూ ఒకే ప్రశ్న వేధించేది. 'ఎందుకీ జీవితం? దేనికి బ్రతకాలి... ఎవరికోసం ... ఈ అవమానం ... తిరస్కారం భరించాలి' అని.

యాంత్రికమైన దైనందిన జీవితం గడిచిపోతున్న రోజులలో మనసులో అనివార్యం గంభీర వదనంతో, నిటారుగా నిలబడి తనవంకే గుచ్చి గుచ్చి చూసిన సైనికుడు చందూ చూపులు గుర్తుకు వచ్చేవి నళినికి.

తోటి సైనికుల కిరాతక చర్యల బారినుండి అసువులొడ్డి తన మాన ప్రాణాలు రక్షించిన అతణ్ణి తలచే కొద్దీ తన బ్రతుక్కు ఒక అర్థం పరమార్థం బోధపడసాగింది.

ఆరు మాసాల వివాహ బంధం ఉన్న భర్తకన్నా ఆరు గంటల పరిచయం కూడా లేని అపరిచిత సైనికుడు చందూ సాహసం... ధైర్యం... నళినిలో తెలియని సంకల్పానికి నాంది చేశాయి.

తనే ననుకుంటే తన చుట్టూ ఉన్న తోటి మానవుల్లో ఘోరాతి ఘోరమైన అవమానాలు, నిర్భాగ్యులు, నిస్సహాయులు ఎంతో మంది తారస పడ్డారు. వారికన్నా తనే మిన్న అనిపించింది.



## ఉగాది సంరంభం

క్రౌరు వల్లని వాడు — ఎర్రని
కంటి చూపుల వాడు గొంతున
రాగ అలది మధించు కోయిల
జేడు విచ్చెను తోటలో! !
నింపేసు శరీర కాంతుల
పూల గుండెల తేనె త్రాగి
సానుగీతులు మ్రోగు షట్పద
స్వాము లుండిరి పూలలో! !
కొమ్మకొమ్మన చివురు తొడిగి
గుమ్మలై వాసనలు విరిసే
వేప విచ్చిన పూల కోటల
తోట విచ్చెను పారిజాతం! !
చితుకు చితుకున ఆకు రాల్చిన
బ్రతుకులో చైతన్య మెగసే
తరుకు బెరుకుల క్రొత్త చిగురుల
రాల్చె తలపులు మధ్యమై! !
ఇంట పూచిన వేప పూవూ
ఇంటిమామిడి కాయముక్కలు
చెరకు ముక్కలు కలిపి ఒక్కటై
నిలచు రుచు లందించె జగతికి! !
కుసుమ మధ్యక ప్రణయ భావుక
హృదయ మదనోద్వేగ వాయుక
పార్వతీముడు మరుడు సుమధుమ
న్మంకృతుల్ మ్రోయించె నెల్లెడ !!

- బులుసు వెంకటేశ్వర్లు

చందూలాగ ధైర్యంగా నిలబడి, ప్రాణాలను సైతం ఒడ్డి తోటి అబలలకు చేయూత నివ్వాలన్న సంకల్పం కల్గింది నళినిలో. ఒంటిమీద పుట్టింటి వారిచ్చిన బంగారం మిగిలే ఉంది. దానిని అమ్మి కాందిశీకుల శిబిరం నుండి విడివడి తనతోటి నలుగురు నిర్భాగ్యురాండ్రతో జీవిస్తూ, జీవితాన్ని ఒక క్రమతకు మరల్చుకొంది నళిని.

ఆ రోజుల్లో నళిని గీసిన బొమ్మే ... ఇది ... ఇది రేఖా చిత్రమే అయినా అందులోని పురుషుడు ఒక పరిపూర్ణ మానవుడు.

రోజులు జరిగిపోతున్నాయి. నళిని పేరు మరుగున పడిపోయి సరళా బెన్‌గా మిగిలిపోయింది. నలుగురితో స్థాపించిన ఈ సదనం నాలుగు వందల వరకూ ఆశ్రయమిస్తోంది!"

అంతవరకూ నా ఉనికినే మర్చిపోయి నళిని రూపు రేఖలను...చేయని నేరానికి శిక్ష అనుభవించిన పదిహేనేళ్ళ నళిని, ధైర్యసాహసాలతో నళిని శీలాన్ని కాపాడిన చందూ... ఎక్కడో విహరిస్తోంది నా మనసు. జీవితాన్నే కాచి వడపోసిన సరళా బెన్ ఒకప్పటి నళిని అనుకొంటే ఆశ్చర్యంతోపాటు ఏదో తెలియని బాధ ఆవరించింది.

"చెప్పడమైతే మూడు ముక్కల్లో చెప్పగలిగాను గానీ ఈ స్థాయికి చేరుకోవడానికి ముప్పై ఏ సంవత్సరాల జీవితం మూడు జన్మలకు సరిపడా అనుభవాన్ని గడించాను, డాక్టర్ సాబ్" అంటూ కళ్ళు మూసుకుంది సరళా బెన్.

అలా ధ్యానముద్రలో పడిన నళినిని చూస్తుంటే, ఆమె హృదయాన్ని నా కుతూహలం కొద్దీ ఎంతటి సంక్షోభానికి గురిచేశానో అనుకొనేసరికి నాలో ఒక విధమైన పశ్చాత్తాపం కలిగింది.

సరళాబెన్ కళ్ళు తెరవగానే "సారీ, బెన్‌జీ. మీకు శ్రమ కలిగించాను. గతాన్ని తవ్వి మీకు బాధ కలిగించాను" అన్నాను మనస్ఫూర్తిగా.

చిరునవ్వుతో "డాక్టర్ సాబ్! లేదు. అలా నొచ్చుకోకండి. ఈ చరిత్ర నాలో గత ముప్పై ఏ సంవత్సరాలుగా సమాధి చేయబడి ఉంది. ఈ రోజు ఏ పుణ్యమా అని చందూ గురించి మీతో చెప్పుకొనే అపూర్వ అవకాశం కల్గింది. నా మనసూ తేలిక పడింది" అంది.

ఒకసారి చందూ బొమ్మ వంక చూశాను. నిలువెత్తు గంభీర వదనుడు, ధీశాలి... ఖాకీ సైనిక దుస్తుల్లో నా కళ్ళముందు సాక్షాత్కరించాడు. అప్రయత్నంగా చేతులు జోడించాను ఆ అమరజీవికి.

అవును. ప్రపంచమంతా రాక్షసత్వం లేదు. ఎక్కడో మంచితనమూ ఉంటుంది. కానీ సరళా బెన్ లాగ ఎంత మంది ధైర్యంగా నిలవగలరు? అన్న ప్రశ్న ఉదయించింది.

బయట జీపు మోత వినిపించడంతో మరోమారు చందూ వంక చూసి సరళా బెన్ దగ్గర సెలవు పుచ్చుకుందుకు చేతులు జోడించాను.

జీపులో కూర్చున్న నాలో జనాఘడ్ ప్రయాణం తెలియని అనుభూతి మిగిల్చింది. ✱